క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఏజీపీ

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామానికి చెందిన కొలుగూరి శాంతన్‌రావు హైకోర్టులో ప్రభుత్వ సహాయ న్యాయవాది(ఏజీపీ)గా నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దామోదర్‌రావు పాల్గొన్నారు.

జగిత్యాల: డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన జనార్దన్‌రావు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న విద్యపై చర్చించారు.

రాయికల్: సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని జాయింట్ సెక్షన్ కమిటీ జిల్లా సెక్రటరీ కె.రవీందర్ శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, అప్పటివరకు పేస్కేలు అమలు చేయాలని, విధి నిర్వహణలో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు.

రక్షాబంధన్ వేడుకలు



కుమ్మరిపల్లిలో వేడుకలు నిర్వహిస్తున్న ధర్మ జాగరణ సమితి నాయకులు

రాయికల్: కుమ్మరిపల్లి గ్రామంలో శనివారం ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయికల్ ప్రముఖ్ తిరుకోవెల సురేందర్ మాట్లాడుతూ.. నీకు నేను రక్ష.. నాకు నీవు రక్ష.. మనం దేశానికి రక్ష అంటూ ప్రతిజ్ఞ చేయించారు. మాజీ ఎంపీటీసీ ఉదుత రవీందర్, శీలం సంతోష్, పాలిక శేఖర్, శ్రీనివాస్, కొడిమ్యాల శేఖర్, రవీందర్‌రెడ్డి, పంచతి శేఖర్, పంచతి రాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ర్యాలీ



తక్కళ్లపెల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కథలాపూర్: తక్కళ్లపెల్లి గ్రామంలో మాల మహానాడు సభ్యులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని, ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. అధ్యక్షుడు భూపెల్లి సంజీవ్, నాయకులు కోట శంకర్, భూపెల్లి రాజేందర్, క్యాతం రాజేశ్, కోట లక్ష్మినర్సయ్య, శశి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా జనార్దన్



నూతన కార్యవర్గ సభ్యులు

రాయికల్: అల్లీపూర్ రేణుక గౌడ సంఘం అధ్యక్షుడిగా దోసారపు జనార్దన్, ఉపాధ్యక్షుడిగా గొడ్డండ్ల చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, కోశాధికారిగా లవన్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా దోసారపు రాజేశ్ శనివారం ఎన్నికయ్యారు.

వసతి గృహాల తనిఖీ



జ్యోతిరావుపూలే మహిళ కళాశాలలో తనిఖీ చేస్తున్న ఎంపీవో రవిబాబు

జగిత్యాలరూరల్: లక్ష్మీపూర్ గ్రామంలోని జ్యోతిరావుపూలే మహిళ కళాశాల వసతి గృహం, పొలాసలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్, కండ్లపల్లి మోడల్ స్కూల్ వసతి గృహాన్ని శనివారం జగిత్యాల రూరల్ ఎంపీవో రవిబాబు తనిఖీ చేశారు. ఆరోగ్య సమస్యల బారిన పడకుండా, డెంగీకి గురి కాకుండా, క్రిమికీటకాలు, పాము కాటుకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రం చేయించారు. డిఫెన్స్ శాఖ రక్షణ దళాలకు సంబంధించిన ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీలో ప్రవేశాలు, ఉద్యోగాలపై అవగాహన కల్పించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీలో పురుషోత్తం



రాయికల్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీలో రాయికల్‌కు చెందిన యువ న్యాయవాది అల్లె పురుషోత్తంను నియమిస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. అణగారిన దళితవర్గాలకు న్యాయవాదిగా సేవలందిస్తానని తెలిపారు. తన నియమకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

చెరువుతో స్నేహం..

- 15 ఏళ్లుగా ప్రతిరోజూ స్విమ్మింగ్
- ఆదర్శంగా నిలుస్తున్న ఈత బృందం
- గంటపాటు.. 2 కిలోమీటర్ల దూరం ఈదుతూ..
- ఉదయం 5 గంటలకే మొదలు



చెరువులో ఈత కొడుతున్న స్విమ్మర్స్

సండే స్పెషల్



చెరువులో రిలాక్స్ అవుతూ..

జగిత్యాలటౌన్: సీజన్‌తో పని లేదు. పండుగలు పబ్బాలకు బ్రేక్ తీసుకోరు. వర్షం, చలితో సంబంధం లేకుండా ఉదయం 5 గంటలకే జగిత్యాల పట్టణ సమీపంలోని కండ్లపెల్లి చెరువుకు చేరుకుంటున్న స్విమ్మింగ్ మిత్రులు గంటకు పైగా చెరువులోనే గడుపుతూ దాదాపు రెండు కిలోమీటర్ల మేర చెరువులో ఈదుతూ చెరువంతా కలియతిరుగుతారు. 15 ఏళ్లుగా చెరువులో ఈత కొడుతూ ఆరోగ్య సంరక్షణకు తొలి ప్రాధాన్యమంటున్న స్విమ్మింగ్ ఫ్రెండ్స్ హెల్త్ కమిట్‌మెంట్‌పై సండే స్పెషల్.

ఆరోగ్యమే మహాభాగ్యం..

ఆరోగ్యమే మహాభాగ్యమనే పెద్దల మాటలు, జబ్బు రాకముందే జాగ్రత్తపడాలన్న వైద్యుల సూచనలతో జగిత్యాలకు చెందిన 30 మంది మిత్రులు గ్రూపుగా ఏర్పడ్డారు. తమ వృత్తి, వ్యాపార, ఉద్యోగాల్లో నిత్యం బిజీగా ఉండే ఈ స్విమ్మింగ్ గ్రూప్ ఆరోగ్యం విషయంలో మాత్రం రాజీ పడరు. వర్షం పడుతున్నా, చలి పెడుతున్నా ఈ స్విమ్మింగ్ గ్రూప్ సభ్యులు ఉదయం 4.30 గంటలకే తమ ఇళ్ల నుంచి బయలు దేరి 5 గంటల వరకు కండ్లపెల్లి లేదా అంతర్గాం చెరువుకు చేరుకుంటారు. ఇలా ఒక్కరోజు.. రెండు రోజులు కాదు.. ఏకంగా 15 ఏళ్లుగా ఈతకు వెళ్తున్నారు. చెరువు దగ్గర వాహనాల శబ్దం అవుతుందంటే చాలు.. ఉదయం 5 గంటలైందని నిద్ర లేస్తున్నామని అంటున్నారు స్థానికులు.

నీటిలో వివిధ రకాల ఫీట్లు

నీటిలో దిగిన మిత్రులు ముందుగా చెరువు ఇవతలి గట్టు నుంచి అవతలి గట్టుకు సుమారు కిలోమీటర్ దూరం వెళ్తారు. తిరిగి మరో కిలోమీటర్ ఈదుకుంటూ ఇవతలి గట్టుకు చేరుకుంటారు. ఆ తర్వాత ఎవరికి నచ్చినవిధంగా వారు నీటిలో తేలియాడుతూ రకరకాల ఫీట్లు చేస్తుంటారు. కొందరు నీటిపై వెళ్లకిలా పడుకొని శవాసనం వేస్తే.. మరికొందరు నీటి గట్టు నుంచి చెరువులోకి డైవ్ చేస్తూ కేరింతలు కొడుతుంటారు. వీరిలో 25 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వయసు వారుండటం విశేషం. వయసుతో సంబంధం లేకుండా స్విమ్మింగ్‌తో ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటున్న ఈ మిత్ర బృందం పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఈతతో సత్ఫలితాలు



స్విమ్మింగ్ అన్ని వయసుల వారికి మంచి వ్యాయామం. స్విమ్మింగ్‌తో ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడి గుండె జబ్బులను నివారిస్తుంది. బ్లడ్ ప్రెషర్‌ను తగ్గించి బీపీని అదుపులో ఉంచుతుంది. రోజు అరగంట స్విమ్మింగ్ చేస్తే రోజంతా చురుగ్గా ఉండటంతోపాటు రాత్రి మంచి నిద్ర పడుతుంది. ఆస్తమా లాంటి శ్వాస సంబంధ వ్యాధులన్నింటికీ ఈతతో చెక్ పెట్టొచ్చు.

– డా.శ్రీనివాస్, ఎండీ, హోమియో

టాబ్లెట్ వేసుకునే అవసరమే రాలేదు



నా వయసు 45 ఏళ్లు. నేను 15 ఏళ్లుగా మిత్రులతో కలిసి క్రమం తప్పకుండా ఈత కొడుతున్నా. 15 ఏళ్లుగా ఏ టాబ్లెట్ వేసుకునే అవసరమే లేకుండా పోయింది.

– చెన్నాడి సత్తిరెడ్డి, జగిత్యాల

ఒక గ్రూపుగా ఏర్పడ్డాం



30 మంది సభ్యులం కలిసి ఒక గ్రూపుగా ఏర్పడి సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతిరోజు ఉదయం స్విమ్మింగ్ చేస్తున్నాం. ప్రతిరోజు ఈత కొట్టడంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్నా.

– లక్ష్మణ్‌రావు, జగిత్యాల

నృసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

ధర్మపురి: ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా దేవస్థానం పక్షాన ఈవో శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను సమర్పించారు. ముందుగా దంపతుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వేద పండితులు బొజ్జ రమేశ్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్ తదితరులున్నారు.

విప్ వివాహ వార్షిక వేడుకలు

గొల్లపల్లి: ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సతీమణి కాంతాకుమారి సిల్వర్ జూబ్లీ వివాహ వార్షిక వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న అర్చకులు

హిందువులపై దాడికి నిరసనగా ర్యాలీ

రాయికల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ శనివారం రామాజీపేట గ్రామంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహం నుంచి హనుమాన్ ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మరణించిన హిందువులకు సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కోరుట్ల: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం రాత్రి హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.



రాయికల్: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

విజయోత్సవ సభ విజయవంతం చేయండి

మేడిపల్లి: మండల కేంద్రంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం జరిగే మాదిగ ఉప కులాల విజయోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ వల్లంపల్లి, దమ్మన్నపేట, మాచాపూర్, మన్నేగూడెం, ఈదుల లింగంపేట, దేశాయిపేట, మోత్కురావుపేట, పసునూర్, కల్వకోట గ్రామాలకు వెళ్లి మాదిగ ఉప కులాలకు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాకిలి ఇజ్రయిల్, టాయ్స్ అధ్యక్షుడు దీపక్, ఎమ్మార్పీఎస్ భీమారం మండల అధ్యక్షుడు చిలివేరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



కోరుట్ల: పట్టణంలోని ఏసికోని గుట్ట శ్రీఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కౌన్సిలర్లు పుప్పాల ఉమాదేవి, తిరుమల గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పెగడపల్లి: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తుందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని బతికపల్లిలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 238 మందికి రూ.50లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, 16 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించారు. నియోజకవర్గంలోని సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఆర్ఐ శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుగౌడ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై వినతి

ధర్మపురి: తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీరాజ్ ఉద్యోగులు అడ్లూరికి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం కలిశారు. స్పందించిన విప్ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

జాతీయ అవార్డు గ్రహీత మల్లేశ్‌కు కేటీఆర్ సన్మానం

మల్లాపూర్: సామాజిక సేవలతోపాటు యువతకు స్ఫూర్తిగా నిలిచిన మహానంది జాతీయ అవార్డు గ్రహీత గనవేని మల్లేశ్(రేగుంట)ను శనివారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సన్మానించారు. జిల్లా వ్యాప్తంగా నిరుపేదలకు అందించిన సేవలకు జాతీయ అవార్డుతో మల్లేశ్‌కు తగిన గుర్తింపు వచ్చిందన్నారు. చిన్న వయస్సులోనే మల్లేశ్ జాతీయ అవార్డు అందుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సామాజిక సేవ కార్యక్రమాలను కొనసాగిస్తూ మంచి పనులతో ప్రజలతో మన్ననలు పొందాలని సూచించారు.

రెగ్యులర్ డీఈవో పోస్ట్ మంజూరు చేయాలి

జగిత్యాల: జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ వినతిపత్రం సమర్పించారు. జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లు గడుస్తున్నా విద్యాశాఖకు రెగ్యులర్ డీఈవో పోస్టు మంజూరు కాలేదన్నారు. ఉపాధ్యాయులకు నెలనెలా పదోన్నతులు కల్పించాలని, జీవో నంబరు 67ను పునరుద్ధరించాలని కోరారు.

ఇద్దరిపై వీధి కుక్కల దాడి

మెట్‌పల్లిరూరల్: మండలంలో ఇద్దరిపై వీధి కుక్కలు దాడి చేశాయి. రామలచ్చక్కపేటలో నిహన్స్ అనే మూడేళ్ల బాలుడు ఇంటి బయట ఆడుకుంటుడగా.. విట్టంపేటలో ఆకుల రాజు అనే వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వారిద్దరిని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎల్‌వోసీ అందజేత

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం తిప్పాయిపల్లి గ్రామానికి చెందిన శ్రీపతి మానస అనారోగ్యంతో బాధపడుతోందని గ్రామానికి చెందిన మల్లేశం చొప్పదండి ఎమ్మెల్యే సత్యంకు శనివారం తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం రూ.2లక్షల ఎల్‌వోసీ అందజేశారు.

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వెల్గటూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్దన్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి కిరణ్, నాయకులు వెంకటగిరి, బండారి రాజేందర్, మల్లారెడ్డి, చక్రపాణి పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

మేడిపల్లి: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కట్ట లింగన్న అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం ఓ పాజిటివ్ రక్తం అవసరముందని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న మేడిపల్లి మండలం కల్వకోట గ్రామానికి చెందిన కట్ట విష్ణు, కట్ట రాజేందర్, చిరుత విజయ్, చిరుత అజయ్, గుగ్గిళ్ళ రాజసాయిలు అనే యువకులు రక్తదానం చేశారు.

న్యాయం చేయాలి

జగిత్యాలటౌన్: పెద్దాపూర్ గురుకులంలో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్, స్టేట్ హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలో పాము కాటుతో మృతిచెందిన అనిరుధ్, 15 రోజుల క్రితం జ్వరంతో మృతి చెందిన గుణ ఆదిత్య కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో చెట్ల పొదలను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్, హాస్టల్స్ కన్వీనర్ నీరటి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాడవేని సునీల్, విగ్నేష్, శివ ప్రణయ్, హర్షవర్ధన్ ఉన్నారు.

స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం

రాయికల్: పట్టణానికి చెందిన సాత్వికరెడ్డి సీపీ గేట్‌లో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్‌లో స్టేట్ 7వ ర్యాంక్ సాధించగా.. శనివారం సంఘమిత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. యూత్ అధ్యక్షుడు పటేల్ శివారెడ్డి, ఉపాధ్యక్షుడు సూర్యంరెడ్డి, కోశాధికారి అనిల్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు

జగిత్యాలజోన్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జగిత్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలను సీనియర్ న్యాయవాది ముదుగంటి జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



సారంగాపూర్: ఆర్అండ్‌బీ శాఖ అధికారులు సారంగాపూర్–జగిత్యాల మధ్య రూ.5.65కోట్లతో చేపట్టిన హైలెవల్ వంతెన పనులు పూర్తి చేసినా.. ఇప్పటికీ వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్డులు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మట్టి పోసి వాహనాలను అనుమతించడంతో బురద మట్టిలో వాహనాలు దిగబడి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639

పేదలకు న్యాయం చేయడమే లక్ష్యం

జగిత్యాల: పేద, బలహీన వర్గాలకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. టీఆర్‌నగర్‌లోని గుట్టపై డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు నీటిని సరఫరా చేసేందుకు నిర్మించిన 14 లక్షల లీటర్ల వాటర్‌ట్యాంక్‌ను శనివారం పరిశీలించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు రూ.14 కోట్లతో వాటర్‌ట్యాంక్ నిర్మించామన్నారు. గతంలోని 500 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, 4500 డబుల్‌బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు ట్యాంక్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



డబుల్ బెడ్‌రూం ఇళ్ల నీటి ట్యాంకులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

248 మంది రైతులకు రూ.1.56కోట్ల పంట రుణాలు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల సహకార సంఘం పరిధిలోని 248 మంది రైతులకు రుణమాఫీ కాగా.. వారికి శనివారం కొత్తగా రూ.1.56కోట్ల రుణాలు అందించారు. ఇప్పటికే రెండువిడతలుగా రుణమాఫీ చేశామని, ఈనెల 15న రూ.2 లక్షల వరకు రుణమాఫీ అవుతుందని పేర్కొన్నారు. సహకార సంఘం ద్వారా రైతులకు బీమా సౌకర్యం కల్పించడం సంతోషించదగిన విషయమన్నారు. రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. జగిత్యాల, కల్లెడ సంఘాల చైర్మన్లు పత్తిరెడ్డి మహిపాల్ రెడ్డి, సందీప్‌రావు, సీఈవో వేణు, డైరెక్టర్లు లింగన్న, శంకరయ్య, పోచమల్లయ్య, రాజిరెడ్డి, దేవమ్మ, గంగారాజం, నారాయణ, స్వామిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ నరేందర్‌రెడ్డి

మల్యాల: కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జీఆర్ఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఆల్ఫోర్స్ ఎన్ఎస్వీ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశానికి విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు కె.అశ్వథామ, జి.శ్రీహర్ష, కె.చరిత్, జి.అఖిల్, ప్రహలాదిక్య, రిషిత్‌ను అభినందించారు. డాక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయికల్ యువకులకు లెజెండరీ అవార్డు



సంతోష్

రాయికల్: పట్టణానికి చెందిన గంగధరి సురేశ్ కోడి రామకృష్ణ లెజెండరీ అవార్డు, సదుల్ల సంతోష్ మదర్ థెరిసా లెజెండరీ అవార్డులను శనివారం అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అందుకున్నారు. బీసీ చైర్మన్ కృష్ణమోహన్ చేతులమీదుగా అందించారు.



అవార్డు అందుకుంటున్న సురేశ్

పథకాలను వినియోగించుకోవాలి

మల్లాపూర్: తపాలా శాఖ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సఫీయుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద పోస్టల్ బీమా పథకాలపై అవగాహన కల్పించారు. మహేశ్, రాజేశం, రాము, రామకృష్ణ, వెంకటరమణ, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై గుంత పూడ్చివేత



ఎస్సై ఆధ్వర్యంలో గుంతను పూడ్చుతున్న యువకులు

మల్యాల: నూకపల్లి శివారులో జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై గుంతను శనివారం ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో యువకులు పూడ్చారు. నూకపల్లి వరద కాలువ వంతెన రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. వాహనదారులు గుంతను తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు వరద కాలువలోకి దూసుకెళ్లే ప్రమాదముందని ఎస్సై యువకుల సహకారంతో గుంతను పూడ్చివేశారు.

వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

జగిత్యాలరూరల్: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా మాతాశిశు సంరక్షణ శాఖ వైద్యాధికారి జైపాల్‌రెడ్డి అన్నారు. జగిత్యాలలోని ధరూర్ క్యాంప్ ఎస్సీ, ఎస్టీ వసతి గృహంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు పరిశుభ్రతపై దృష్టి సారించడంతోపాటు, పౌష్టికాహారం తీసుకోవాలని, అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యురాలు రాణి, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, శ్యామ్, వేణు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

మెట్‌పల్లి: పట్టణంలోని చావిడి వద్ద శనివారం సైనిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 మంది నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సేవా భావంతో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసిన యువకులను పలువురు అభినందించారు.